
# సోదా సీదాగానే..

- ఫైనాన్షియర్లలో పేరొందిన రాజకీయ నేతలు
- తనిఖీలపై ముందుగానే కొందరికి ఇన్ఫర్మేషన్
- వెంటనే అప్రమత్తమైన వడ్డీ వ్యాపారులు
- పక్కాగా పట్టుబడిన ఓ ఫైనాన్షియర్
- భారీగా డబ్బుకట్టలు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం
- ఓ నాయకుడి ఆదేశాలతో డబ్బు, పత్రాలు వెనక్కి ఇచ్చేసిన వైనం


వడ్డీ వ్యాపారులపై పోలీసు దాడులు



*ప్రజలను పట్టి పీడించుకుతింటున్న వడ్డీ వ్యాపారులపై పోలీసులు దాడి చేయడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది. అధిక వడ్డీ వసూలు చేస్తున్న వారిపై చర్యలు చేపట్టడం సబబేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. అయితే, తనిఖీల సందర్భంగా కొందరు పోలీసుల వ్యవహార శైలి విస్మయానికి గురి చేసింది. బడా ఫైనాన్షియర్లతో అంటకాగే కొందరు ఖాకీలు సోదాల విషయమై ముందుగానే ఉప్పందించినట్లు తెలిసింది. మరో వైపు, పక్కా ఆధారాలతో పట్టుబడిన ఓ బడా ఫైనాన్షియర్‌ను వదిలేయడం ఇప్పుడు జిల్లాలో దుమారం రేపుతున్నది. ఇంకోవైపు, తీవ్ర వేధింపులతో అమాయకుల ఆత్మహత్యలకు కారణమైన వ్యాపారుల వైపు పోలీసులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.*

*– నిజామాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

బాన్సువాడ నియోజకవర్గంలోని ఉమ్మడి మండలానికి చెందిన ఓ ఫైనాన్షియర్ అధిక వడ్డీ పేరుతో అమాయక ప్రజలను వేధించడంలో పేరొందాడు. జనాలను దోచుకుంటున్న సదరు తాకట్ల వ్యాపారికి అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ స్థాయి నాయకుడు ఒక రు అండగా నిలవడం చర్చనీయాంశమైంది. జిల్లాలో అక్రమంగా జరుగుతున్న ఫైనాన్స్ వ్యాపారంపై ఫోకస్ చేసిన సీపీ కల్మేశ్వర్ తన సిబ్బందిని రంగంలోకి దించారు. దీంతో బాన్సువాడ నియోజకవర్గంలోని సదరు తాకట్ల వ్యాపారి నివాసంలో సోదాలు చేయగా భారీగా డబ్బు, సంచులకొద్దీ ప్రామిసరీనోట్లు, ఒప్పంద పత్రాలు బయటపడ్డాయి. దీంతో సదరు ఫైనాన్షియర్ అధికార పార్టీ నాయకుడ్ని ఆశ్రయించగా, ఆయన పోలీసులపై ఒత్తిడి తెచ్చాడు. ఆ నేత ఆదేశాలతో పోలీసులు అతడ్ని వదిలేయడంతో పాటు స్వాధీనం చేసుకున్న డబ్బు, పత్రాలు వెనక్కి ఇచ్చినట్లు తెలిసింది. సదరు పోలీసుస్టేషన్‌లో సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తే ఈ వ్యవహారమంతా బయట పడుతుందని స్థానికులు చెబుతున్నారు. బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ డివిజన్లలో పోలీసులు కొంత మందిని కావాలనే కాపాడినట్లు చర్చ జరుగుతున్నది. నిజామాబాద్ నగరంలో గతంలో పలువురు ఆత్మహత్యలకు కారణమైన ఫైనాన్షియర్ల జోలికి వెళ్లకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



### బడా వ్యాపారులను వదిలి..

ఫైనాన్షియర్లపై పోలీసు దాడుల విషయం ముందుగానే లీక్ అయినట్లు తెలిసింది. వడ్డీ వ్యాపారులతో చనువుగా ఉండే కొందరు పోలీసులే వారిని అప్రమత్తం చేసినట్లు సమాచారం. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ తదితర మండలాల్లో పేరొందిన బడా ఫైనాన్షియర్లపై దాడులు జరగక పోవడం ఈ అనుమానాలకు తావిస్తున్నది. మరో వైపు, బహిరంగంగానే ఆఫీసులు తెరిచి మరీ ఫైనాన్స్ దందాలు నడుపుతున్న వారిపైనా పోలీసులు ఫోకస్ చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది అంతుబట్టడం లేదు. ఫైనాన్షియర్ల నుంచి ముడుపులు తీసుకుంటూ వారి జోలికి వెళ్లడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


### 20 నుంచి 30 శాతం కమీషన్..

ప్రజల అత్యవసర పరిస్థితులను ఆసరాగా తీసుకుని ఫైనాన్షియర్లు దోచుకుంటున్నారు. రూ.లక్ష అప్పు ఇస్తే, అందులో ముందుగానే 20–30 శాతం వడ్డీ రూపంలో కోత పెడుతున్నారు. పైగా ష్యూరిటీ కింద బంగారం, వెండి నగలను కుదువ పెట్టుకోవడం, ఆస్తిపత్రాలు, పట్టా పాసు బుక్కులు, ఖాళీ చెక్కులను సైతం తీసుకుంటున్నారు. ఇక రూ.10–20 వడ్డీ వసూలు చేస్తూ జనం నడ్డీ విరగ్గొడుతున్నారు. పొరపాటున వడ్డీ చెల్లించడం ఆలస్యమైతే ఇంటికొచ్చి నానా రభస చేస్తున్నారు. దీంతో అవమాన భారంతో చాలా మంది తనువు చాలిస్తుండగా, మరి కొంత మంది ఉన్నది అమ్మేసి అప్పులు తీర్చేస్తున్నారు. తెలిసీ తెలియక ఫైనాన్షియర్ల వద్దకు వెళ్లి ఇరుక్కుపోయి.. ఏళ్ల కొద్దీ వడ్డీల మీద వడ్డీలు, చక్రవడ్డీలను చెల్లించుకుంటూ దినదిన గండంగా గడుపుతున్న కుటుంబాలు అనేకం ఉన్నాయి. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ వంటి పట్టణాల్లో బహిరంగంగానే ఆఫీసులు తెరిచి మరీ డబ్బుల దందాను నడుపుతున్నారు. వీరికి ఎలాంటి అనుమతులు లేకున్నా గుట్టుగా దందాను కొనసాగిస్తున్నారు. వీరి ఆగడాలు వెలుగులోకి వచ్చినప్పుడు ఆమ్యామ్యాలకు అలవాటు పడి ఖాకీలు పట్టించుకోవడం లేదని సమాచారం. పోలీసులు ప్రస్తుతం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండటంతో చాపకింద నీరులా పాతుకుపోయిన ఫైనాన్షియర్ల రాక్షసత్వానికి అడ్డుకట్ట పడుతుందని బాధితులు ఆశతో ఉన్నారు. ఒకట్రెండు రోజుల సోదాలతో కాకుండా ఫైనాన్షియర్ల ఆగడాలను పూర్తిగా అరికట్టాలని బలంగా కోరుతున్నారు.

### కళ్లెం పడేనా..?

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అక్రమ వడ్డీ వ్యాపారం ఎప్పటి నుంచో వేళ్లూనుకుంది. ఫైనాన్షియర్ల ఆగడాలకు కుటుంబాలకు కుటుంబాలే బలైన ఉదంతాలు కూడా ఉన్నాయి. సరిగ్గా రెండేండ్ల క్రితం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పప్పుల సురేశ్ కుటుంబం విజయవాడలో ఆత్మహత్య చేసుకుంది. ఫైనాన్షియర్ల ధన దాహానికి కుటుంబం మొత్తం బలి అయిపోయింది. ఈ ఉదంతం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. బీజేపీకి చెందిన ఓ నాయకుడే ఈ వ్యవహారంలో ప్రధాన ముద్దాయి కాగా, కొద్దికాలం పరారీలో ఉన్న సదరు నేత.. ఆ తర్వాత పోలీసులను మచ్చిక చేసుకుని కేసును సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వడ్డీ వ్యాపారుల దుర్మార్గాలకు ఎంతో మంది ప్రాణాలు తీసుకున్న ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా దందా నడిపిస్తూ సామాన్యులను పట్టి పీడిస్తున్న వ్యాపారులు అంతటా ఉన్నారు. ఈ అక్రమ వ్యాపారంలో కొంత మంది పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సైతం ఉండడం గమనార్హం. తమ పేరు, పలుకుబడిని అడ్డంగా పెట్టుకుని అక్రమంగా సంపాదించిన సొమ్మును అవసరంలో ఆదుకున్నట్లుగా బిల్డప్ ఇచ్చి అమాయకులను ఉచ్చులోకి లాగుతున్నారు. అయితే, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని ఫైనాన్షియర్ల ఆగడాలకు పోలీసులు కళ్లెం వేస్తుండడంపై హర్షం వ్యక్తమవుతున్నది. అదే సమయంలో కొంత మందిని వదిలి పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయకర్తలు వీరే..



కామారెడ్డి/ఖలీల్‌వాడి, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించింది. నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ స్థానాలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు.

**జహీరాబాద్ పార్లమెంట్ స్థానం**

| నియోజకవర్గం | సమన్వయకర్త పేరు |
|---|---|
| జహీరాబాద్ | దేవిశ్రీప్రసాద్‌రావు, మాజీ చైర్మన్ |
| అందోల్ | పట్నం మాణిక్యం, డీసీసీబీ వైస్ చైర్మన్ |
| నారాయణ్‌ఖేడ్ | భిక్షపతి, మాజీ చైర్మన్ |
| కామారెడ్డి | జనార్దన్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే |
| ఎల్లారెడ్డి | తిరుమల్‌రెడ్డి, మాజీ చైర్మన్ |
| బాన్సువాడ | దఫేదార్ రాజు, జడ్పీ మాజీ చైర్మన్ |
| జుక్కల్ | పోచారం భాస్కర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ |
| **నిజామాబాద్ పార్లమెంట్ స్థానం** | |
| ఆర్మూర్ | కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్యే |
| నిజామాబాద్ అర్బన్ | ప్రభాకర్‌రెడ్డి(నుడా చైర్మన్), అలీం |
| నిజామాబాద్ రూరల్ | వి. గంగాధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ |
| బోధన్ | దాదన్నగారి విఠల్‌రావు, జడ్పీ చైర్మన్ |
| బాల్కొండ | ఎల్ఎంబీ రాజేశ్వర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ |
| కోరుట్ల | ఎల్.రమణ, ఎమ్మెల్సీ |
| జగిత్యాల | దావ వసంత (జడ్పీ చైర్‌పర్సన్), లోక బాపురెడ్డి, మాజీ చైర్మన్ |

# కాంగ్రెస్ ఝూటా పార్టీ

- మోసపూరిత హామీలతో గద్దెనెక్కింది
- ఎంపీ అర్వింద్ జిల్లాకు చేసింది శూన్యం
- నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



*మల్లాపూర్‌లో నిర్వహించిన ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే సంజయ్*

మల్లాపూర్/ సారంగాపూర్, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ 420 మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను నిండాముంచి గద్దెనెక్కిందని, అదో బడా ఝూటా పార్టీ అని నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌డ్డి సైతం ఝూటా కోర్ అని, అసత్య ప్రచారం చేసి గెలిచిందని, ఇప్పుడు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, రేవంత్ చెప్పిన అబద్ధాలను ప్రజల ముందు ఎండగట్టాలని, ఓటుతో బుద్ధి చెప్పేలా చైతన్యం కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. మంగళవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావుతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. కేఎంఆర్ గార్డెన్స్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సాయంత్రం బీర్‌పూర్‌లో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మండపంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డితో కలిసి హాజరయ్యారు. ఆయా చోట్ల ఆయన మాట్లాడారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇచ్చేందుకు జీవన్‌రెడ్డి అడ్డువస్తున్నారనే కారణంతో అధిష్టానం జీవన్‌రెడ్డిని ఎన్నికల బరిలో నిలిపిందన్నారు. ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. నిధులు తీసుకురాని అసమర్థుడు ధర్మపురి అర్వింద్ అని, ఈ ఐదేండ్లలో చేసింది శూన్యమని, ప్రజలకు ముఖం చూపించే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపించాలని, మీ కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా నిలుస్తానని, ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు.

# ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

**-కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, ఏప్రిల్ 16: మహనీయుల త్యాగాల ఫలితంగా స్వేచ్ఛా వాయువులు పీల్చగలుగుతున్నామని, వారి త్యాగాలు వృథా కాకుండా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డి డిగ్రీ కళాశాలలో 'శక్తి వంతమైన ప్రజాస్వామ్యంలో ఓటరు భాగస్వామ్యం' అనే అంశంపై స్వీప్, పొలిటికల్ సైన్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఒక రోజు వర్క్ షాప్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా వీవీ ప్యాట్ ద్వారా ఓటు వినియోగం తెలుసుకోవడంతోపాటు పకడ్బందీ వ్యవస్థతో 12 గంటల్లో ఫలితాలు వెల్లడిస్తున్నామని అన్నారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో రఘునాథరావు, స్వీప్ అధికారి వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, ప్రొఫెసర్లు కిష్టయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.




*మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్*

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్
- కామారెడ్డి, నిజామాబాద్‌లో కొనుగోలు కేంద్రాల పరిశీలన

కామారెడ్డి/ఇందల్వాయి/కంఠేశ్వర్, ఏప్రిల్ 16 : ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. కామారెడ్డి మండలం ఉగ్రవాయిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్.. రైతులకు కల్పించిన వసతులు, రిజిస్టర్లు, తూకాలు, నూతనంగా ప్రవేశపెట్టిన ఐరిస్ విధానం, ట్యాబ్ ఎంట్రీ వివరాలను తెలుసుకున్నారు. తాలు, మట్టి లేకుండా తేమ శాతం 17 ఉండేలా చూసుకొని ధాన్యాన్ని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు. హార్వెస్టర్ యజమానులు పొలం కోయడానికి గంటకు ఎంత వసూలు చేస్తున్నారని రైతులను అడగగా రూ.1800 తీసుకుంటున్నారని తెలిపారు. అనంతరం రాఘవేంద్ర రైస్‌మిల్లును సందర్శించి రోజువారీ లక్ష్యాల మేరకు మిల్లింగ్ పూర్తి చేయాలని యజమానులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున బాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ నిత్యానంద్ ఉన్నారు.



*కామారెడ్డి జిల్లా ఉగ్రవాయిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర సివిల్ సప్లయ్ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్*

### 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో ఇప్పటికే 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, ధాన్యం విక్రయించిన రైతులకు బిల్లుల చెల్లింపులు వేగంగా చేపడుతున్నామని కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి నిజామాబాద్ జిల్లాలోని రైస్‌మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. అనంతరం గుండారం గ్రామంలోని జై గణేశ్ ప్యాడీ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ (రైస్‌మిల్)ను తనిఖీ చేశారు. ఇందల్వాయి మండలం గన్నారం, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులు తీసుకొచ్చిన ధాన్యం తేమశాతాన్ని కొలిచారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్‌వో చంద్రప్రకాశ్, డీఎం జగదీశ్ పాల్గొన్నారు.

# వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి

నవీపేట, ఏప్రిల్ 16: నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రంలో ఓ ఉపాధి హామీ కూలీ వడదెబ్బకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. మండల కేంద్రంలోని లింగం గుట్ట సమీపంలో ఉన్న చెరువులో సోమవారం ఉపాధి హామీ పనులు చేస్తుండగా ఆర్. లావణ్య (38) అనే కూలీ ఎండ తీవ్రతకు లోబీపీతో పల్స్‌రేట్ తగ్గిపోయి గుండెపోటుకు గురైంది. వెంటనే చికిత్స కోసం తోటి కూలీలు, ఉపాధి సిబ్బంది నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఏపీవో నామ్‌దేవ్ తెలిపారు.



*లావణ్య (ఫైల్)*

# ఇయ్యాళ్నే.. రాములోరి లగ్గం

- శ్రీరామనవమికి సర్వం సిద్ధం
- ఊరూరా ముస్తాబైన రామాలయాలు

*శ్రీరామనవమిని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం నిర్వహించే సీతారాముల కల్యాణానికి దేవాలయాలను విద్యుద్దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కొబ్బరి ఆకులతో కల్యాణమండపాలు, చలువ పందిళ్లు వేశారు. ఖిల్లా, డిచ్‌పల్లి, సుభాష్‌నగర్ రామాలయాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రఖ్యాత రామాలయాలపై ప్రత్యేక కథనం...*



### శక్కర్‌నగర్‌లో భద్రాద్రి తరహా...


బోధన్, ఏప్రిల్ 16 : ఉమ్మడి జిల్లావాసులకు ఠక్కున గుర్తొచ్చే రామాలయాల్లో బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని శ్రీ కోదండ రామాలయం ఒకటి. నిజాంషుగర్స్ యాజమాన్యం ఈ రామాలయాన్ని నిర్మించింది. 1951 నవంబర్ 8న బ్రహ్మర్షి, వేద పండితులు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఈ రామాలయంలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయుడి పాలరాతి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. భద్రాద్రిలో మాదిరిగానే ఇక్కడ కూడా సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తుండడం విశేషం. భద్రాద్రిలోని రామాలయం మాదిరిగానే శక్కర్‌నగర్ రామాలయంలో విగ్రహాలు పశ్చిమాభిముఖంలో ఉంటాయి.



### గౌరారం ఆలయానికి 500 ఏండ్ల చరిత్ర

**- ఏండ్లుగా వెలుగుతున్న అఖండ జ్యోతి**

గాంధారి, ఏప్రిల్ 16: కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని గౌరారంలో 500 ఏండ్ల చరిత్ర కలిగిన శ్రీరామంజనేయ స్వామి ఆలయం నెలకొన్నది. ఇక్కడి ఆలయంలో వందల ఏండ్ల నుంచి అఖండ జ్యోతి వెలుగుతూనే ఉన్నది. ఈ ఆలయం పూర్తిగా రాతి స్తంభాలతో ఆకర్షణీయంగా నిర్మించారు. ఆలయంలోని ఆంజనేయస్వామి విగ్రహ హృదయంలో సీతారామలక్ష్మణులు ఉంటారు.





### రాముడు నడయాడిన కందకుర్తి

రెంజల్, ఏప్రిల్ 16: కందకుర్తి సమీపాన త్రివేణి సంగమక్షేత్రాన్ని అనుకొని ఉన్న రామాలయానికి మూడు వందల ఏండ్లకు పైగా చరిత్ర ఉన్నది. శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు త్రేతాయుగంలో దండకారణ్యంలోని గౌతమీనదీ, మంజీరానది తీరం నుంచి కాలినడకన గోదావరి గుండా వెళ్తూ కందకుర్తిలో బస చేసినట్లు చరిత్ర చెబుతున్నది. ఈ రామాలయాన్ని ఛత్రపతి శివాజీ దర్శించుకున్నారు.

### ఒకేరోజు శ్రీరామనవమి, సాయిబాబా జన్మదిన వేడుకలు

సారంగాపూర్, ఏప్రిల్ 16 : ఉమ్మడి జిల్లాల్లోనే పేరుగాంచిన మాధవ్‌నగర్ సాయిబాబా ఆలయం వేడుకలకు ముస్తాబైంది. శ్రీరామ నవమి, సాయిబాబా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఒకేరోజు రెండు వేడుకలు ఉండడంతో 20 వేలకు పైగా భక్తులు దర్శించుకునే అవకాశం ఉన్నది. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఈవో శ్రీరాం రవీందర్‌గుప్తా తెలిపారు.

